క్లుప్తంగా

ఏపీ చీఫ్ జస్టిస్‌ను కలిసిన న్యాయవాదులు



నందిగామ: బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నందిగామ న్యాయవాదులు గురువారం ఆంధ్రప్రదేశ్ చీఫ్ జస్టిస్ ఏవి శేష సాయిని హైకోర్టులోని ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బండి మల్లికార్జునరావు, పి. ప్రకాష్ ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులు నందిగామలో నూతనంగా నిర్మిస్తున్న కోర్టు భవనాలు తదితర అంశాలపై న్యాయమూర్తితో మాట్లాడారు. న్యాయవాదులు ఈశ్వర ప్రగడ రంగారావు, బొందలపాటి రామకృష్ణ, మన్యం నారాయణరావు, కొనకంచి శ్రీనివాసరావు, దేవదాస్ న్యాయమూర్తిని కలిసిన వారిలో ఉన్నారు.

వీఆర్‌ఏల నిరసన

నందిగామ: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట గురువారం వీఆర్‌ఏలు రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు నేపథ్యంలో తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ రెండు రోజులపాటు రిలే నిరాహార దీక్షలు నిర్వహించనున్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

నందిగామ: మున్సిపల్ కార్మికులు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం నిరాహార దీక్ష నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా నిరాహార దీక్ష నిర్వహించినట్లు మున్సిపల్ కార్మిక సంఘం నాయకుడు సురేష్ తెలిపారు.

ఘనంగా బీఓబీ వ్యవస్థాపక దినోత్సవం




జగ్గయ్యపేట: బ్యాంక్ ఆఫ్ బరోడా 116వ వ్యవస్థాపక దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కోదాడ రోడ్డులోని బ్రాంచ్‌లో బ్యాంకు ఫౌండర్ సయ్యాజీరావ్ గైక్వాడ్ చిత్ర పటానికి సిబ్బంది పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలు ప్రైవేట్ పాఠశాలల ఆవరణలో సిబ్బంది మొక్కలు నాటారు. ఖాతాదారులకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేనేజర్ గోపీ, సిబ్బంది గోవర్ధన్, నవీన్, పెద్ద సంఖ్యలో ఖాతాదారులు పాల్గొన్నారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన



నందిగామ: రైతులు పంట సాగు సమయంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా వనరుల కేంద్రం డెప్యూటీ డైరెక్టర్ మాధవీలత అన్నారు. మండలంలోని గొల్లమూడి రైతు భరోసా కేంద్రంలో గురువారం స్థానిక రైతులకు పలు రకాల పంటల సాగుకు సంబంధించి మెలకువలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సమీపంలోని పత్తి, మొక్కజొన్న పంటలతోపాటు వరి నారుమళ్లను పరిశీలించారు. ఈ అనంతరం పలువురు వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ మొక్కజొన్నలో వచ్చే కత్తెర పురుగు నివారణకు వ్యవసాయ శాఖ అధికారుల సూచనల ప్రకారమే మందులను పిచికారీ చేయాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు మోనిషా, శ్రీనివాస్, ఖాసిం పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి అన్నారు. గురువారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎంగా పనిచేసి ఉద్యోగోన్నతిపై ఎంఈఓగా విజయవాడ రూరల్‌కు బదిలీ అయిన అజ్మీరు సూరిబాబును పాఠశాల ఆవరణలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతోందన్నారు. అందుకు అనుగుణంగా బోధన జరగాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గూడపాటి లావణ్య, ఎంపీపీ మార్కపూడి గాంధీ, మైనింగ్, పూసల కార్పొరేషన్ డైరెక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షులు రవికుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు కూచి విష్ణు, చెన్నకేశవులు పాల్గొన్నారు.

బిర బిర పెరిగే బీర

- తక్కువ పెట్టుబడి.. ఎక్కువ లాభాలు
- మూడు నెలల్లో దిగుబడి
- ఆసక్తి చూపుతున్న రైతులు

పెనుగంచిప్రోలు: సంప్రదాయానికి భిన్నంగా రైతన్నలు ఉద్యాన పంటలైన కూరగాయల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. అధిక మొత్తంలో పెట్టుబడి వెచ్చించి మిర్చి, పత్తి సాగు చేసి ఒక్కోసారి ప్రకృతి కరుణించక పోవటంతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సాగునీరు పెద్దగా అవసరం ఉండని కూరగాయల సాగుకు రైతులు ప్రస్తుతం బాగా మొగ్గుచూపుతున్నారు. తక్కువ పెట్టుబడులు, ఎక్కువ లాభాలు వచ్చే అవకాశం ఉండటంతో కూరగాయల సాగుపై మక్కువ చూపుతున్నారు. ముఖ్యంగా కేవలం మూడు నెలల్లోనే దిగుబడినిచ్చే బీరకాయల సాగును ఎక్కువగా చేపడుతున్నారు.

70 ఎకరాల్లో బీర సాగు..

పెనుగంచిప్రోలు మండలంలోని పలు గ్రామాలతో పాటు నియోజకవర్గంలోని జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల్లో పలువురు రైతులు సుమారు 70 ఎకరాల్లో బీర సాగు చేపట్టారు. బీర కోతలు కూడా కోస్తున్నారు. ధర కూడా మార్కెట్‌లో ఆశాజనకంగా ఉంది. ఎకరానికి రైతులు రూ.20 నుంచి రూ.25 వేల పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో బీర రూ.25 నుంచి రూ.30 వరకు ఉంది. రైతులకు కూరగాయల సాగుతో ధర బాగుంటే పెట్టుబడి పోను ఎకరానికి రూ.30వేలు వరకు మిగులుతున్నాయి. పంట కూడా మూడు నెలల్లోనే వస్తుందని



పెనుగంచిప్రోలులో సాగులో ఉన్న బీర



మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉన్న బీరకాయలు

రైతులు అంటున్నారు. పండించిన పంటను స్థానికంగా విక్రయించటంతో పాటు జగ్గయ్యపేట, నందిగామ రైతు బజార్‌లతో పాటు పెనుగంచిప్రోలు దుకాణాలకు తరలించి స్వయంగా అమ్మకాలు జరుపుతున్నారు.

నీటి వినియోగం తక్కువ..

నీటి ఎద్దడి ఉన్న ఈ ప్రాంత భూముల్లో తక్కువ నీటి వినియోగం ఉన్న కూరగాయల సాగు బాగుంటుందని రైతులు అంటున్నారు. తక్కువ పంట కాలం, పెట్టుబడి తక్కువగా ఉండటంతో ప్రస్తుత పరిస్థితుల్లో బీర సాగు లాభదాయకంగా ఉంటుందని వివరిస్తున్నారు.

గిట్టుబాటు ధర ఉండాలి..



పండించిన పంటకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర ఉంటే రైతులకు కూరగాలయ సాగు లాభదాయకం. 3 నెలలకు వచ్చే పంట పొలం కౌలుకు సరిపోతుంది. రెండో పంట వేసుకుంటే వచ్చే ఆదాయం రైతుకు మిగులుతుంది. ప్రస్తుతం బీరలు కోస్తున్నాం. ధర ఫర్వాలేదు.

– రాములు, బీర రైతు, పెనుగంచిప్రోలు

రాయితీపై విత్తనాలు ఇస్తారు



కూరగాయల సాగుకు ఉద్యాన శాఖ ద్వారా రాయితీపై విత్తనాలు ఇస్తారు. కూరగాయల సాగు సీజనల్‌గా రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రకృతి అనుకూలిస్తే చాలా లాభసాటిగా ఉంటుంది. తీగజాతి కూరగాయల సాగుకు పందిళ్లకు కూడా ప్రభుత్వ సహకారం ఉంటుంది.

– కె. రామసుబ్బారెడ్డి, ఏఓ

సంక్షేమ పథకాల అమలులో నూతన ఒరవడి

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వీరులపాడు: సంక్షేమ పథకాల అమలులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతన ఒరవడి సృష్టిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. వీరులపాడు గ్రామంలో గురువారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాలను వివరించటంతో పాటు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు గత ప్రభుత్వం విద్యా రంగాన్ని పూర్తిగా విస్మరిస్తే జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రభుత్వ పాఠశాలలను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. నాడు–నేడుతో వాటి రూపును మార్చుకుని సరికొత్తగా దర్శనమిస్తున్నాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, ఎంసీ మాజీ వైస్ చైర్మన్ నువ్వుల విశ్వనాథం, నాయకులు శీలం లక్ష్మీప్రసన్న, మండూరి గోపి తదితరులు పాల్గొన్నారు.



వీరులపాడులో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

అతివేగం అనర్థదాయకం



నందిగామ: వాహనాలు అతివేగంగా నడపటం ప్రమాదకరమని ట్రాఫిక్ ఎస్‌ఐ నరేష్ సూచించారు. పట్టణంలోని సీఎం రోడ్ లో వాహనాలు అతి వేగంగా నడుపుతున్న పలువురికి గురువారం సాయంత్రం ట్రాఫిక్ పోలీసులు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు పలు వాహనాలకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ రద్దీగా ఉండే ప్రాంతాలలో కూడా కొందరు యువకులు వాహనాలను కావాలనే అతి వేగంగా నడుపుతున్నారని ఆ విధంగా చేయడం ఎంతో ప్రమాదకరమన్నారు. ముఖ్యంగా పట్టణంలో స్నేక్ డ్రైవింగ్ పై ఫిర్యాదులు వస్తున్నాయన్నారు.

సమస్యల పరిష్కారానికే సురక్ష

పోలంపల్లి(వత్సవాయి): సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష క్యాంపులను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను తెలిపారు. గురువారం పోలంపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతుభరోసా, ఆరోగ్య ఉపకేంద్రాల భవనాలను ప్రారంభించారు. స్థానిక రైతులతో కలిసి మునేటి కాలువకు నీటిని విడుదల చేశారు. ఎంపీపీ కొలుసు రమాదేవి, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, సర్పంచ్ మాదుగుల లాజర్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కాటేపల్లి రామలక్ష్మి, కొలికపోగు వెంకటేశ్వర్లు, సొసైటీ అధ్యక్షుడు కాటేపల్లి రవికుమార్, సామినేని లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నిస్సహాయులకు అండ జగనన్న సురక్ష..

జగ్గయ్యపేట అర్బన్: నిస్సహాయులకు అండగా జగనన్న సురక్ష కార్యక్రమం నిలుస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. పట్టణంలోని రంగస్వామి బజారులో 8వ సచివాలయం(13, 14వ వార్డులు) జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ వార్డుల పరిధిలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా నాలుగేళ్లలో రూ. 12 కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు.మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, యువజన విభాగం అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, పట్టణ సచివాలయాల కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్ర, పార్టీ పట్టణ మహిళ, ఎస్టీ, కార్మిక విభాగాల అధ్యక్షులు మునిని రాజ్యలక్ష్మి, బద్దూనాయక్, వెంకయ్య పాల్గొన్నారు.

ప్రజలు మేలును మరిచిపోరు..

కీసర/పేరకలపాడు(కంచికచర్ల): గ్రామ స్వరాజ్యం కోసం పరితపిస్తూ గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఎన్నటికీ మర్చిపోరని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. కీసర గ్రామంలో గురువారం జగనన్న సురక్ష గ్రామసభ సర్పంచి పేరం నర్సమ్మ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే 810మందికి సర్టిఫికెట్లు అందజేశారు. ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జెడ్పీటీసీ సభ్యుడు వేల్పుల ప్రశాంతి, ఎంపీటీసీ సభ్యురాలు పాపట్ల సీత, నాయకులు పరిటాల రాము, వేల్పుల రమేష్, పాపట్ల స్వామి, చలమల ప్రభాకర్ పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ లబ్ధి..

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన అనతికాలంలో అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తుందని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పేరకలపాడు గ్రామ సచివాలయంలో సర్పంచి మన్నె సాత్విక అధ్యక్షతన జగనన్న సురక్ష గ్రామ సభ జరిగింది. 870 మందికి సర్టిఫికెట్లు అందజేశారు.

ప్రజల వద్దకే సేవలు..

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే 11 రకాల సేవలు అందుతున్నాయని ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి అన్నారు. గురువారం ముండ్లపాడులో సర్పంచ్ గూడపాటి లావణ్య అధ్యక్షతన సురక్ష క్యాంప్ నిర్వహించారు. లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మైనింగ్, పూసల కార్పొరేషన్ డైరెక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి, ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్, ఏఓ సిద్ధారెడ్డి, డీటీ భాస్కరరావు, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ పాల్గొన్నారు.

నవాబుపేటలో...

నవాబుపేటలో సర్పంచ్ గొర్రెముచ్చు మేరీ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి అర్హులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎంపీపీ, జెడ్పీటీసీతో పాటు తహసీల్దార్ కె. లక్ష్మీకల్యాణి, ఎంపీటీసీ సభ్యులు మాతంగి శాంతకుమారి, సొసైటీ అధ్యక్షుడు, డీసీఎంఎస్ డైరెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలు సులభతరం..

పోచంపల్లి(జగ్గయ్యపేట): జగనన్న సురక్షతో ప్రభుత్వ సేవలు మరింత సులభతరంగా లబ్ధిదారులకు అందుతున్నాయని డెప్యూటీ తహసీల్దార్ నాగరాజు తెలిపారు. గ్రామంలోని జగనన్న సురక్ష క్యాంపును గురువారం నిర్వహించారు. పలువురు లబ్ధిదారులకు సర్టిఫికెట్‌లను పంపిణీ చేశారు. సర్పంచ్ బూతుకూరి లక్ష్మీనాగిరెడ్డి, కార్యదర్శి జగ్గయ్య పాల్గొన్నారు. అదే విధంగా తిరుమలగిరి సచివాలయంలో తహసీల్దార్ చిన్నారావు జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించారు.

అవినీతికి.. మధ్యవర్తులకు చోటు లేదు..

నందిగామ టౌన్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అవినీతికి తావు లేదని, సంక్షేమ పథకాల అమలులో మధ్యవర్తులకు చోటు లేదని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. నందిగామ పట్టణంలోని సచివాలయం-2, మండలంలోని అంబారుపేట గ్రామ సచివాలయ ఆవరణలో అధికారులు నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపులో పలువురు లబ్ధిదారులకు సర్టిఫికెట్‌లను పంపిణీ చేశారు. సర్పంచ్ బొల్లినేని పద్మజ, నాయకులు పాల్గొన్నారు.

మాట మార్చడంలో చంద్రబాబు దిట్ట..

నందిగామ టౌన్: నిరుపేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తుంటే రాష్ట్రం దివాళా తీస్తుందని ఆక్రోశం వెళ్లగక్కిన చంద్రబాబు ఎన్నికలు దగ్గరపడే కొద్ది సంక్షేమ పథకాలను అమలు చేస్తానని హామీలిస్తూ బూటకపు మేనిఫెస్టో ప్రకటించారని శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని 15,16 వార్డుల పరిధిలోని ఎనిమిదవ సచివాలయంలో నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపును గురువారం ఆయన పరిశీలించారు. 2,775 మంది లబ్ధిదారులకు ఆయన సర్టిఫికెట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఓర్సు లక్ష్మి, కౌన్సిల్ సభ్యురాలు అచ్చి దివ్య, ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.



జగ్గయ్యపేట 8వ సచివాలయం వద్ద ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న విప్ ఉదయభాను



కంచికచర్లలో మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



నందిగామ 8వ సచివాలయ వద్ద సర్టిఫికెట్‌లు అందజేస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్



ముండ్లపాడులో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్, తదితరులు



పోచంపల్లిలో సర్టిఫికెట్‌లు అందజేస్తున్న అధికారులు

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. గురువారం పట్టణంలోని ఆయన స్వగృహంలో వడ్డెరలకు మంజూరైన రూ.30 లక్షల రుణాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డెర సొసైటీని రిజిస్టర్ చేయించుకుని ఎనిమిదేళ్లుగా అందులో సభ్యులుగా కొనసాగుతూ నేడు ఒక్కొక్కరూ రూ.లక్ష చొప్పున 30 మంది రూ.30 లక్షలు పంచుకోవటం అభినందనీయమన్నారు. ఇచ్చిన రుణాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో మరింత పెద్ద మొత్తంలో రుణ పరపతి పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు, లబ్ధిదారులు ఉదయభానును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామారావు, మారెళ్ల అమ్మిరెడ్డి సత్యనారాయణరెడ్డి ట్రస్ట్ చైర్మన్ మారెళ్ల పుల్లారెడ్డి, పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు వూట్ల నాగేశ్వరరావు, మండల శ్రీనివాస్‌గౌడ్, ట్రేడ్ యూనియన్ నాయకులు దేరంగుల శ్రీనివాసరావు, పార్టీ జిల్లా బీసీ ఉపాధ్యక్షులు కుంచపు నారాయణ, ఏఎంసీ డైరెక్టర్ తమ్మిశెట్టి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు నగదు అందజేస్తున్న విప్ ఉదయభాను

ప్రతి ఇంటికీ రక్షిత నీరు

పెంట్యాలవారిగూడెం(వత్సవాయి): ప్రతి ఇంటికీ రక్షిత మంచినీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను పేర్కొన్నారు. గురువారం జలజీవన్ మిషన్ ద్వారా రూ. 50 లక్షలతో నిర్మించిన రక్షిత మంచినీటి కుళాయిలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనిషి జీవనవిధానంలో మంచినీటి పాత్ర ఎంతో ఉందన్నారు. 80 శాతం వ్యాధులు కేవలం కలుషిత నీటిని తాగడం వల్లనే సంక్రమిస్తాయని తెలిపారు. ఎటువంటి ఇబ్బందులుల లేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కొలుసు రమాదేవి, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, సర్పంచ్ వడ్డే పరమయ్య, సొసైటీ అధ్యక్షుడు కాటేపల్లి రవికుమార్, పంచాయతీ కార్యదర్శి రంగారావు పాల్గొన్నారు.



రక్షిత మంచినీటి కుళాయిని ప్రారంభిస్తున్న ప్రభుత్వవిప్ ఉదయభాను

ఊర చెరువు అభివృద్ధి పనుల పరిశీలన

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణంలో ఉన్న ఊర చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. గురువారం చెరువు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఇప్పటికే చెరువు చుట్టూత ప్రహరీ నిర్మాణం, వాకింగ్ ట్రాక్ తదితర నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, యువజన విభాగం అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, ఎస్టీ విభాగం అధ్యక్షుడు బద్దూనాయక్, కౌన్సిలర్లు తన్నీరు నాగేంద్ర, వట్టెం మనోహర్, దువ్వల రామకృష్ణ, దువ్వల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపానికి రూ. లక్ష విరాళం..

పట్టణంలోని శ్రీచంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానం (పెద్ద శివాలయం)లో నిర్మించనున్న కల్యాణ మండపానికి గాను తన వంతు సహకారంగా ఎమ్మెల్యే ఉదయభాను తొలి విరాళంగా రూ. లక్ష అందజేశారు. చెక్కును పెద్ద శివాలయం దేవస్థాన చైర్మన్ గెల్లా పూర్ణచంద్రరావు, ఈవో జయప్రకాష్‌బాబుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్యాణమండపానికి దేవదాయ శాఖ నుంచి రూ. 60 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, జేఆర్సీ విద్యా సంస్థల చైర్మన్ రంగాపురం నరసింహారావు, శ్రీను, దేవస్థాన కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.



కల్యాణమండపం నిర్మాణానికి విరాళం చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

రోటరీక్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

గన్నవరం: సమాజంలోని పేద వర్గాల అభ్యున్నతికి రోటేరియన్లు తమవంతు తోడ్పాటునందించాలని పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ శ్యామ్ మొవ్వ పిలుపునిచ్చారు. స్థానిక కొత్తపేటలోని రోటరీ ఆడిటోరియంలో రోటరీక్లబ్ గన్నవరం శాఖ నూతన అధ్యక్షుడు జాస్తి విజయభూషణ్‌కుమార్, కార్యదర్శి నర్రా సీతారామారావుతో పాటు కార్యవర్గ ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్యామ్ మాట్లాడుతూ కరోనా వంటి విపత్కర పరిస్థితిని అధిగమించిన మానవాళికి భవిష్యత్‌పై ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే దిశగా రోటేరియన్లు కృషి చేయాలని తెలిపారు.క్లబ్ గత అధ్యక్ష, కార్యదర్శులు చిమట రామారావు, ద్రోణవల్లి నాగేశ్వరరావు చేసిన సేవా కార్యక్రమాలను అసిస్టెంట్ గవర్నర్ ఏజీ. పార్థసారథి ప్రశంసించారు. అనంతరం రోటేరియన్లు చింతపల్లి సీతారామయ్య, డాక్టర్ వై. నరసింహారావు, డాక్టర్ ఏకాంబరేశ్వరరావును సేవా సత్కారం చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు, నూతన ఉపాధ్యక్షులు గన్నె వెంకట్రావు, సంయుక్త కార్యదర్శి జి. త్రివేది, కోశాధికారి టీఎస్ఆర్‌కె. ప్రసాద్ పాల్గొన్నారు.



నూతన అధ్యక్ష, కార్యదర్శులను సత్కరిస్తున్న సభ్యులు

మున్సిపల్ కార్మికుల రిలే దీక్షలు

జగ్గయ్యపేట అర్బన్: మున్సిపల్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని కోరుతూ గురువారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో రిలే దీక్షలు చేపట్టారు. స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన దీక్ష శిబిరాన్ని సీఐటీయూ మండల అధ్యక్షురాలు సోమోజు నాగమణి ప్రారంభించారు. సీఐటీయూ మండల కార్యదర్శి గౌస్ మియా, మండల నాయకులు రామనాథం, ప్రజా సంఘాల నాయకులు కోట కృష్ణ, దంతాల వెంకటేశ్వర్లు, శేషు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక పోస్టాఫీసు రోడ్‌లో రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల వారి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను గురువారం ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్ వట్టెం మనోహర్, వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు ఎక్సైజ్ బాషా, కాశి కిషోర్, దువ్వల రామకృష్ణ, ఎస్‌ఐ రామారావు, విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంఈవోగా పాల్ కెనడీ

వీరులపాడు: మండల ఎంఈవోగా పాల్ కెనడీ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంఈవోగా పని చేస్తున్న చిట్టిబాబు జగ్గయ్యపేటకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కెనడీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తమ వంతు కృషి చేయనున్నట్లు చెప్పారు. అంతే కాకుండా ఈ ఏడాది 10వ తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సత్కరించారు.

పాస్‌పోర్ట్ పోయినది

గొటిక వెంకట రెడ్డి S/o. పున్నారెడ్డి (48 yrs) డోరు నెం. 10-155, కాంద్రపాడు గ్రామం, చందర్లపాడు మండలం, కృష్ణాజిల్లాకు చెందిన నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ ది. 12.07.2023న కోనాయిపాలెంలోని మా పొలం వద్ద నుండి కాంద్రపాడు బైక్‌పై వెళ్తుండగా మార్గం మధ్యలో జారిపోయినది. సదరు నెం. Y6795710 కావున ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది నెంబరుకు తెలియజేయగలరు.

సెల్: 96661 84954

పాస్‌పోర్ట్ పోయినది

గొటిక విజయలక్ష్మి W/o. వెంకట రెడ్డి, డోరు నెం. 10-155, కాంద్రపాడు గ్రామం, చందర్లపాడు మండలం, కృష్ణాజిల్లాకు చెందిన నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ ది. 12.07.2023న కోనాయిపాలెంలోని మా పొలం వద్ద నుండి కాంద్రపాడు బైక్‌పై వెళ్తుండగా మార్గం మధ్యలో జారిపోయినది. సదరు నెం. Y6797531 కావున ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది నెంబరుకు తెలియజేయగలరు.

సెల్: 96661 84954

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నందిగామ డివిజన్

79950 92114 (నందిగామ)

99122 20547 (జగ్గయ్యపేట)

Office mail : sakshiads@gmail.com